సాక్షి
కర్నూలు
మంగళవారం : 14 : ఫిబ్రవరి : 2023



శివ భక్తుల సేవలో..

బండిఆత్మకూరు: బండిఆత్మకూరు గ్రామానికి చెందిన వృద్ధురాలు సుబ్బమ్మ గ్రామస్తుల సహకారంతో శ్రీశైల పాదయాత్ర భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపడుతోంది.



నృత్య నీరాజనం

శ్రీశైలం టెంపుల్: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా కళారాధన వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి. భక్తి గీతాలకు కళాకారులు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



పకడ్బందీ ఏర్పాట్లు

ప్రాక్టికల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారులు ఆదేశించారు. సోమవారం ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 8లో

న్యూస్‌రీల్

జిల్లా బీసీ సంక్షేమాధికారిగా నాగేశ్వరరావు



కర్నూలు(అర్బన్): జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారిగా ఏ నాగేశ్వరరావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ పీ కోటేశ్వరరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఈ బాధ్యతలు నిర్వహిస్తున్న పీ వెంకటలక్ష్మమ్మ తన వ్యక్తిగత కారణాలతో ఏప్రిల్ 30వ తేదీ వరకు సెలవుపై వెళ్లారు. దీంతో బీసీ కార్పొరేషన్ ఈడీగా విధులు నిర్వహిస్తున్న నాగేశ్వరరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

28న 'జగనన్న విద్యాదీవెన'



కో ఆర్డినేషన్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్‌పిఎస్ఎన్ రెడ్డి

కర్నూలు(అర్బన్): 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి జగనన్న విద్యా దీవెన నిధులు ఈనెల 28వ తేదీన విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి జమ చేయనున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారత అధికారి ఎస్‌పిఎస్ఎన్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక సంక్షేమ భవన్‌లోని తన కార్యాలయంలో సీఈఓలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెనకు సంబంధించి వివిధ సచివాలయాలు, కళాశాలల్లో ఉన్న పెండింగ్‌లను ఈనెల 20వ తేదీలోగా పరిష్కరించాలన్నారు. సచివాలయాల్లోని వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్లను కలసి పెండింగ్‌పై ఆరా తీసి, అర్హులైన విద్యార్థులందరికీ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సహాయ సంక్షేమాధికారులు కె.బాబు, ఎన్.లీలావతి, కో ఆర్డినేషన్ అధికారులు పాల్గొన్నారు.

మైనార్టీ విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లాలోని ముస్లిం మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులకు ఏడీసీఏ, ఎంఎల్ డీటీపీలో ఉచితంగా శిక్షణను అందిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి ఎస్ సబీహాపర్వీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ తీసుకునేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై, 35 సంవత్సరాల లోపు వయస్సు ఉండాలని పేర్కొన్నారు. అకాడమీ ఆధ్వర్యంలో గతంలో శిక్షణ తీసుకున్న వారు ప్రస్తుతం దరఖాస్తు చేసుకోరాదని, మరిన్ని వివరాలకు 9391775902 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

కేసీ కాల్వకు 1,058 క్యూసెక్కుల నీరు



గూడూరు: కర్నూలు– కడప కాల్వకు సోమవారం 1,058 క్యూసెక్కుల నీటి విడుదల చేసినట్లు సుంకేసుల డ్యాం అధికారులు తెలిపారు. రిజర్వాయర్‌లో 0.954 టీఎంసీల నీరు నిల్వ ఉందని, 1,450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు చెప్పారు.

☛ ఏపీలోని రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్, టెక్నాలజీలో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల విద్యార్థులు కూడా ఇక్కడ విద్యను అభ్యసించారు. అయితే విభజన అనంతరం ఫీజు రీయింబర్స్‌మెంట్ లభించకపోవడంతో 2016లో అక్కడి విద్యార్థులు లోకాయుక్తను ఆశ్రయించారు. యూనివర్సిటీ తమ బీటెక్ సర్టిఫికెట్లు ఇవ్వలేదని, భవిష్యత్ అంధకారం అవుతోందని వాపోయారు. కేసు స్వీకరించిన లోకాయుక్త ఈ ఫీజులు తెలంగాణ ప్రభుత్వం చెల్లించేలా తీర్పు ఇచ్చి విద్యార్థులకు సర్టిఫికెట్ల జారీకి ఆదేశించింది.

☛ టీటీడీలో ఆర్జిత సేవా టిక్కెట్ల జారీలో అవినీతికి పాల్పడుతున్నారని 21మంది ఉద్యోగులపై 2010లో లోకాయుక్తకు ఫిర్యాదు వెళ్లింది. దీనిపై విచారణ చేపట్టి కొంతమంది ఉద్యోగులను విధుల నుంచి తొలగించాలని, ఇంకొందరికి ఇంక్రిమెంట్లు కొంతకాలం నిలిపేయాలని 'లోకాయుక్త' తీర్పు ఇచ్చింది.

☛ వైఎస్సార్ కడప జిల్లా అట్లూరు మండల తహసీల్దార్ టి.ఈశ్వరయ్య ప్రభుత్వానికి సంబంధించిన డీకేటీ భూములను అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం లేకుండా కొంతమంది ప్రైవేటు వ్యక్తులకు పట్టాలిచ్చారు. దీనిపై ఫిర్యాదు రావడంతో తహసీల్దార్‌ను సర్వీసు నుంచి తొలగించాలని లోకాయుక్త ఆదేశించింది.

☛ తాడిపత్రి సమీపంలోని పెన్నానదిలో అక్రమ కట్టడాలు నిర్మించి నది స్వరూపాన్ని, ప్రవాహాన్ని దెబ్బ తీస్తున్నారని పత్రికల్లో వచ్చిన వార్త కథనాల నేపథ్యంలో 2022 సెప్టెంబర్‌లో 'లోకాయుక్త' సుమోటోగా స్వీకరించింది. అనంతపురం కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసింది. కమిటీ వేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

సామాన్యుల బ్రహ్మాస్త్రం.. లోకాయుక్త!

ఖర్చు లేకుండా 'న్యాయం'

- కేవలం రూ.150 ఫీజుతో ఫిర్యాదుకు అవకాశం
- న్యాయవాదిని ఏర్పాటు చేసుకునే అవసరం కూడా లేదు
- ఇప్పటికే ఎన్నో కీలక విషయాల్లో తీర్పులు
- అత్యధికంగా కర్నూలు.. అత్యల్పంగా కోనసీమ నుంచి ఫిర్యాదులు

సాక్షి ప్రతినిధి, కర్నూలు: ప్రభుత్వ అధికారులు, సంస్థల వల్ల న్యాయం జరగకపోతే పేదలు సంధించే బ్రహ్మాస్త్రమే 'లోకాయుక్త'. ఖర్చు లేకుండా సామాన్యులకు న్యాయం చేకూర్చే వేదిక ఇది. రాష్ట్ర ప్రజలకు అందుబాటులో ఉండేలా 'లోకాయుక్త'ను ప్రభుత్వం 2021 ఆగస్టు 26న కర్నూలులో ఏర్పాటు చేసింది. జస్టిస్ లక్ష్మణరెడ్డి న్యాయమూర్తిగా ఇప్పటి వరకు ఎన్నో క్లిష్టమైన కేసులకు పరిష్కారం లభించింది. గతేడాది వరకు ఏకంగా 2,863 సమస్యలు పరిష్కారం కావడం విశేషం.

ఇదీ లోకాయుక్త పరిధి..

లోకాయుక్త అంటే అవినీతి వ్యవహారాల్లో ఫిర్యాదు చేసే సంస్థ అనే భావనలో చాలామంది ఉన్నారు. కానీ ప్రభుత్వ అధికారులు, శాఖలు నిబంధనలకు అనువుగా పనిచేయకపోయినా, నిర్లక్ష్యం వహించినా, న్యాయంగా చేయాల్సిన పనిచేయకపోయినా, నిర్లక్ష్యం, అవినీతి ఉన్నా ఎవరికి ఏ రకమైన నష్టం జరిగినా 'లోకాయుక్త'ను ఆశ్రయించవచ్చు. అలాగే సమస్యలను పత్రికల్లో చూసి 'లోకాయుక్త' సుమోటోగా స్వీకరించవచ్చు. అయితే ప్రైవేటు వివాదాలు ఈ సంస్థ పరిధిలోకి రావు.

అప్పటికీ న్యాయం జరగకపోతే..

➡ పబ్లిక్ సర్వెంట్ అయితేనే ఆర్డినెన్స్ పరిధిలోకి వస్తారు.

➡ కొందరు 1బీ అడంగల్ జారీ తహసీల్దార్ జాప్యం చేస్తున్నారని ఫిర్యాదు చేస్తారు. ఈ ఫిర్యాదులను వెంటనే 'లోకాయుక్త' స్వీకరించదు.



లోకాయుక్త కార్యాలయం

ఆర్‌వోఆర్ యాక్టు ప్రకారం తహసీల్దార్ న్యాయం చేయకపోతే ఆర్డీవో, ఆపై జేసీ, ఆపై కలెక్టర్‌ను సంప్రదించే అవకాశం ఉంది. అప్పటికీ న్యాయం జరగకపోతే బాధితులు 'లోకాయుక్త'ను ఆశ్రయించవచ్చు.

➡ అలాగే పోలీసు కేసుల విషయంలో కూడా తాము చెప్పిన నిందితులను ఎఫ్ఐఆర్‌లో చేర్చలేదని, పరిశోధన సరిగా చేయలేదని ఫిర్యాదు చేస్తారు. వీరు కూడా పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సంతృప్తి చెందకపోతే 'లోకాయుక్త'ను సంప్రదించవచ్చు.

రూ.150 ఖర్చుతోనే 'న్యాయం'

లోకాయుక్తలో ఫిర్యాదు చేసేందుకు కేవలం రూ.150 మాత్రమే ఖర్చవుతుంది. దీన్ని రిజిస్ట్రార్, లోకాయుక్త పేరుతో డీడీ తీస్తే సరిపోతుంది. ఫిర్యాదుదారు నేరుగా రావొచ్చు. లేదంటే పోస్టులో పంపొచ్చు. న్యాయవాదులను నియమించుకోవాల్సిన అవసరం కూడా లేదు. లోకాయుక్త పూర్తి బాధ్యత తీసుకుని కేసును విచారించి, ఎప్పటికప్పుడు స్టేటస్‌ను ఫోన్, వాట్సాప్ లేఖల ద్వారా పంపుతుంది. ఫిర్యాదును సంబంధిత జిల్లా కలెక్టర్ లేదా ఇతర అధికారులకు పంపి రిపోర్ట్ తెప్పించుకుని ఫిర్యాదుదారుడికి పంపుతారు. అప్పటికీ సంతృప్తి చెందకపోతే కేసు విచారించి పరిష్కరిస్తారు.

2,863 కేసుల పరిష్కారం

2022 వరకు 7,131 కేసులు లోకాయుక్త పరిధిలో ఉన్నాయి. ఇందులో 2022 డిసెంబర్ 31 వరకు 2,863 కేసులు పరిష్కారమయ్యాయి. గతేడాది మాత్రమే 2,405 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో అత్యధికంగా కర్నూలు జిల్లా నుంచి 398, అత్యల్పంగా కోనసీమ జిల్లా నుంచి 9 వచ్చాయి. వచ్చిన ఫిర్యాదుల్లో రెవెన్యూశాఖపై అత్యధికంగా 1132 కేసులు ఉండటం గమనార్హం. ఇక పోలీసు శాఖపై 234, పంచాయతీరాజ్‌పై 232, మునిసిపల్ శాఖపై 157 కేసులు వచ్చాయి. అత్యల్పంగా మత్స్యశాఖ, గిరిజన సంక్షేమశాఖ నుంచి రెండు చొప్పున మాత్రమే ఫిర్యాదులు ఉన్నాయి.

లోకాయుక్తలోని ఫిర్యాదులు, కేసుల పరిష్కారం ఇలా

విషయం	ఫిర్యాదులు
2022 జనవరి 1 వరకూ పెండింగ్‌లో ఉన్న కేసులు	4,726
2022లో వచ్చిన ఫిర్యాదులు	2,405
పరిష్కారానికి అవకాశం ఉన్న కేసులు	7,131
గతేడాది చివరి వరకూ పరిష్కారమైన కేసులు	2,863
పెండింగ్‌లో ఉన్న కేసులు	4,268



అవగాహన పెరగాలి

లోకాయుక్తపై అవగాహన పెరగాలి. చాలా విస్తృతమైన పరిష్కారాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటైంది. రూ.150 డీడీని రిజిస్ట్రార్ పేరుతో తీసి, పోస్టులో ఫిర్యాదు పంపినా, పరిష్కారమయ్యే వరకు లోకాయుక్త బాధ్యత తీసుకుంది. హైదరాబాద్‌లో ఉన్నప్పుడు కోస్తా నుంచి ఎక్కువగా వచ్చేవి. కర్నూలుకు వచ్చాక ఈ ప్రాంతం నుంచి ఎక్కువగా వస్తున్నాయి. అందరూ దీన్ని వినియోగించుకోవాలి.

– జస్టిస్ లక్ష్మణరెడ్డి, న్యాయమూర్తి, లోకాయుక్త

మదిమదిలో మల్లన్న

శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. సోమవారం మూడోరోజు శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి హంస వాహనంపై విహరించారు. స్వామి వారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకుని భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. –శ్రీశైలం టెంపుల్



శ్రీశైలంలో కనుల పండువగా సాగుతున్న గ్రామోత్సవం, (ఇన్‌సెట్) హంస వాహనంపై ఆదిదంపతులు

అంజలి శర్వాణికి లక్కీచాన్స్

- మహిళా ఇండియన్ ప్రీమియర్ లీగ్ పోటీలకు ఎంపిక



ఆదోని అర్బన్: ముంబైలో సోమవారం సాయంత్రం జరిగిన మహిళా ఇండియన్ ప్రీమియర్ లీగ్ వేలంలో ఆదోని పట్టణానికి చెందిన క్రికెటర్ అంజలి శర్వాణి లక్కీచాన్స్ కొట్టారు. యూపీ లక్నో వారియర్స్ తరపున ఆడేందుకు రూ.55 లక్షలతో ఒప్పందం కుదుర్చుకున్నారు. సోమవారం ఆదోని పట్టణంలో క్రీడాకారిణి తండ్రి రమణారావు, కోచ్ వెంకటేష్ విలేకరులతో మాట్లాడారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి నిర్వహించే మహిళల ఐపీఎల్ మ్యాచ్ కోసం సోమవారం సాయంత్రం ముంబైలో ఐదు టీంలను ఎంపిక చేశారు. అంజలి శర్వాణిని యూపీ లక్నో వారియర్స్ జట్టుకు ఎంపిక చేశారన్నారు. ఇందు కోసం రూ.55 లక్షలతో ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. అంజలి శర్వాణి ప్రస్తుతం సౌతాఫ్రికాలో టీ20 వరల్డ్‌కప్‌లో భారతదేశం తరపున ఆడుతోందని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలి

- రాజకీయపార్టీ ప్రతినిధులతో కలెక్టర్ కోటేశ్వరరావు
- ఎన్నికల కోడ్‌ను ఎవ్వరూ ఉల్లంఘించకూడదు



మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

సాక్షిప్రతినిధి కర్నూలు: ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని రాజకీయపార్టీలు సహకరించాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూలు విడుదలైన నేపథ్యంలో రాజకీయపార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాల గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఎన్నికలతో పాటు కర్నూలు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు ఎన్నికల కమిషన్ ఈ నెల 9న షెడ్యూలు విడుదల చేసిందని కలెక్టర్ అన్నారు. ఆ రోజు నుంచి కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. ఎన్నికల నియమావళిని ఎవ్వరూ ఉల్లంఘించకూడదని తెలిపారు. శాంతియుత వాతావరణంలో పారదర్శకంగా, నిర్భయంగా, సజావుగా ఎన్నికలు జరిగేందుకు అన్ని పార్టీల ప్రతినిధులు సహకరించాలని విన్నవించారు. గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఆర్వోగా అనంతపురం కలెక్టర్, ఏఆర్వోగా కర్నూలు డీఆర్వో వ్యవహరిస్తారన్నారు. అలాగే కర్నూలు స్థానిక సంస్థల ఎన్నికలకు ఆర్వోగా కర్నూలు జాయింట్ కలెక్టర్, ఏఆర్వోగా డీఆర్వో వ్యవహరిస్తారన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో కవరేజి అకౌంటింగ్ బృందాలతో పాటు మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే నోడల్ అధికారులు, సెక్టోరల్, జోనల్ అధికారులను కూడా నియమించామన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు 74, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు 27 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. కర్నూలు లోకల్ అథారిటీస్‌కు సంబంధించి కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని ఆరు ఆర్డీఓ కార్యాలయాల్లో పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలింగ్‌కు వచ్చేవారు ఓటర్ కార్డు లేదా 11 రకాల గుర్తింపు పత్రాలలో ఏదో ఒకటి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. రాజకీయపార్టీల నేతలు కలెక్టర్‌కు పలు సూచనలు చేశారు. పార్టీ ప్రతినిధుల అభిప్రాయాలు, సూచనలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, డీఆర్వో నాగేశ్వరరావు, వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ, బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, తెలుగుదేశం తదితర రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

- వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యం
- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణ
- రాత్రి వేళల్లో విద్యార్థుల ఇంటికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సమావేశాలు
- హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా చర్యలు
- సాక్షి ముఖాముఖిలో డీఈఓ డాక్టర్ వీ రంగారెడ్డి



సాక్షి ఇంటర్వ్యూ

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లోచదివే పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని డీఈఓ డాక్టర్ వీ రంగారెడ్డి తెలిపారు. గత నెలలోనే అన్ని హైస్కూళ్లలో సిలబస్ పూర్తయిందని, జనవరి 30 నుంచి ఈ నెల 5వ తేదీ వరకు మొదటి రివిజన్ టెస్ట్ నిర్వహించినట్లు చెప్పారు. ఈ నెల 13 నుంచి రెండో రివిజన్ టెస్ట్ మొదలు కానుందని పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన టీచర్లతో తయారు చేయించిన మెటీరియల్‌ను, మోడల్ ప్రశ్నపత్రాలను విద్యార్థులకు ఇస్తున్నామన్నారు. 'సాక్షి'తో సోమవారం డీఈఓ ముఖాముఖి మాట్లాడారు. ఆ వివరాలు..

ప్రశ్న: ఈ ఏడాది పదో తరగతి ఫలితాల పెంపునకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: కోవిడ్ కారణంగా గతేడాది పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం తగ్గింది. ఈ ఏడాది వంద శాతం ఫలితాలు సాధించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సెప్టెంబరు నెలాఖరు నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు ప్రతి రోజూ కనీసం రెండు ప్రశ్నలు నేర్చుకునేలా ఉపాధ్యాయులు తర్ఫీదు ఇస్తున్నారు. మార్కులు తక్కువ వచ్చిన వారికి పునఃశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని బట్టి టైం టేబుల్ తయారు చేసి, ఉదయం, సాయంత్రం వేళలలో ఏయే సబ్జెక్టులు చదివించాలో తెలియజేసి, అమలు చేస్తున్నాం.

ప్ర: ప్రత్యేక తరగతులను ఎవరు పర్యవేక్షిస్తున్నారు?

జ: ప్రత్యేక తరగతులతో పాటు హైస్కూళ్లలో విద్యార్థులకు పరీక్షల్లో వస్తున్న మార్కులపై పర్యవేక్షణ చేసేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు నాలుగు బృందాలు ఏర్పాటు చేశాం. డీఈఓ, సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్, కర్నూలు, ఆదోని డిప్యూటీ డీఈఓల ఆధ్వర్యంలో బృందాలు పనిచేస్తున్నాయి. ఈ బృందాలకు అప్పగించిన మండలాల్లోని ఎంఈఓలు, ఆ మండలంలోని ఓ హెచ్‌ఎం పర్యవేక్షించనున్నారు. పాఠశాల స్థాయిలోను ఆయా క్లస్టర్ పరిధిలోని సీఆర్‌పీలు పర్యవేక్షిస్తున్నారు. ప్రతి రోజు వారి పరిధిలోని స్కూళ్లలో ప్రత్యేక తరగతులను తనిఖీ చేస్తూ వాట్సాప్‌లో సమాచారం తెలియజేస్తున్నారు.



ప్ర: హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది కదా?

జ: జిల్లాలోని 25 మండలాల్లో కౌతాళం, కోసిగి, హొళగుంద, హాలహర్వి మండలాల్లో ఒకటి, రెండు చోట్ల సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది. అయితే ఇక్కడ తాత్కాలికంగా పని సర్దుబాటు ద్వారా సమస్యను తీర్చాం. మిగిలిన అన్ని మండలాల్లో పదోన్నతులు కల్పించి, సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా చర్యలు తీసుకున్నాం.

ప్ర: ఈ ఏడాది ప్రశ్నపత్రాలను కుదించారు కదా? దీని ప్రభావం ఎలా ఉండొచ్చు?

జ: జిల్లాలోని 25 మండలాల్లో ప్రభుత్వ స్కూళ్ల నుంచి 22,791 మంది, ప్రైవేటు స్కూళ్ల నుంచి 8,975 మంది పదోతరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షల్లో పేపర్ల సంఖ్య 11 నుంచి 6 పేపర్లకు కుదించారు. విద్యార్థులు గతంలో మాదిరిగా కాకుండా డిస్క్రిప్షన్ మెథడ్‌లో ఎక్కువగా రాయాల్సి ఉంటుంది. విద్యార్థులకు అలవాటు చేసేందుకు రెగ్యులర్‌గా పరీక్షలు రాయిస్తున్నాం.

ప్ర: నైట్ విజన్‌తో ప్రయోజనం ఉంటుందా?

జ: విద్యార్థులు చదువుకునేలా ఇంటి వాతావరణం ఉందా? వారి చదువుకు పేరెంట్స్ ఏ మేరకు ప్రోత్సహిస్తున్నారో తెలుసుకునేందుకు నైట్ విజన్ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ఇదీ ప్రతి హైస్కూల్ హెచ్‌ఎం, టీచర్ చేయాలి. చేయడం లేదని తెలిస్తే చర్యలు ఉంటాయి.

ప్ర: జిల్లా పశ్చిమ ప్రాంతాల్లో వలసలు పోయిన వారి పరిస్థితి ఏంటి?

జ: జిల్లాలోని పశ్చిమ ప్రాంతాల్లో నుంచి సీజనల్‌గా వెళ్లే వలస కుటుంబాలను గుర్తించాం. వారి ఇళ్లలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు వలస వెళ్లకుండా తల్లిదండ్రులతో మాట్లాడి, ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీజనల్ హాస్టల్స్‌లో వసతి సదుపాయాలను కల్పిస్తున్నాం.

వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు విశేష స్పందన



వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థులు

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్య శాఖలో నిర్వహిస్తున్న వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు విశేష స్పందన లభించింది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసేందుకు గాను అభ్యర్థులకు ఈ ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఆరు మెడికల్ ఆఫీసర్ పోస్టులకు 22 మంది, 8 స్టాఫ్ నర్సు పోస్టులకు 800కు పైగా అభ్యర్థులు, 2 లాస్ట్ గ్రేడ్ సర్వీస్ పోస్టులకు 60 దరఖాస్తులు వచ్చాయి. కార్యాలయ ఉద్యోగులు, అధికారులు దరఖాస్తులు, అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు.

‘చివరి’ భారం పెద్దాసుపత్రిపైనే!

- ప్రైవేట్ ఆసుపత్రుల నుంచి చివరి నిమిషంలో వస్తున్న రోగులు
- ప్రాణాలు కాపాడేందుకు శాయశక్తులా శ్రమిస్తున్న డాక్టర్లు
- కోలుకోలేక మృత్యువాత పడుతున్న కొందరు
- కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల నిర్వాకంతో పెద్దాసుపత్రిలో పెరుగుతున్న మరణాలు


కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

కర్నూలు(హాస్పిటల్): '' మీకేం భయం లేదు... అంతా మేము చేసుకుంటాం. మాది అంతర్జాతీయ ప్రమాణాలు గల ఆసుపత్రి. ఇక్కడ పెద్ద పెద్ద డాక్టర్లుంటారు. హైదరాబాద్ లాంటి ఆసుపత్రుల్లోని ట్రీట్‌మెంట్ అందిస్తాం'' అంటూ రోగికి వచ్చిన వెంటనే కుటుంబసభ్యులకు కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రులు ధీమా ఇస్తుంటాయి. తీరా రోగికి సీరియస్ అయ్యేసరికి...''కండిషన్ సీరియస్‌గా ఉంది. వెంటనే పెద్దాసుపత్రికి తీసుకెళ్లండి. లేకపోతే బతకడం కష్టం'' అని చేతులు దులుపేసుకుంటున్నాయి. ఫలితంగా చివరి నిమిషంలో పెద్దాసుపత్రికి వచ్చిన రోగులు చికిత్స పొందుతూ కొద్దిసేపటికే కోలుకోలేక మృతి చెందుతున్నారు.

తగ్గని రోగుల సంఖ్య

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ప్రతిరోజూ 2వేల నుంచి 2,500 మంది రోగులు ఓపీ సేవలకు వస్తున్నారు. ఇన్‌పేషంట్లుగా నిత్యం 1500 మంది దాకా ఉంటున్నారు. క్షేత్రస్థాయిలో వైద్యసేవలు పెరుగుతున్నా ఇక్కడ మాత్రం రోగుల సంఖ్య తగ్గడం లేదు. ప్రైవేటు ఆసుపత్రులు అధికంగా ఫీజులు వసూలు చేస్తుండడంతో అధిక శాతం రోగులు పెద్దాసుపత్రికే వస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచే గాక వైఎస్సార్, రాయచోటి, అనంతపురం, పుట్టపర్తి, ప్రకాశం జిల్లాల నుంచి కూడా రోగులు కర్నూలు పెద్దాసుపత్రి వైపే చూస్తున్నారు. ఈ కారణంగా ఎన్ని ఆసుపత్రులు వచ్చినా పెద్దాసుపత్రిలో రోగుల సంఖ్య మాత్రం తగ్గడం లేదు.

సీరియస్‌గా ఉందంటే పెద్దాసుపత్రికే!

ఏ ప్రైవేటు ఆసుపత్రిలోనైనా రోగికి సీరియస్‌గా ఉందంటే వెంటనే కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల మాత్రమే గుర్తు వస్తుంది. ఈ కారణంగా ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, ఏఎంసీ విభాగాలు అత్యవసర పరిస్థితి ఉన్న రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఏఎంసీలో పడక లభించాలంటే అక్కడ నుంచి ఎవ్వరైనా కాస్త బాగై వార్డుకు వెళ్లాల్సి వస్తోంది. కొన్నిసార్లు ఎవరైనా రోగి మరణించాక గానీ ఇక్కడ పడక లభించని స్థితి నెలకొంది.

చివరి నిమిషంలో పంపేస్తున్నారు

కర్నూలు నగరంలోని పలు ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులతో పాటు హైదరాబాద్‌లోని పలు ఆసుపత్రుల నుంచి సైతం రోగులు చివరి నిమిషంలో కర్నూలు పెద్దాసుపత్రికే తిరిగి వస్తున్నారు. ఇలా వచ్చిన వారిని బతికించేందుకు వైద్యులు, సిబ్బంది అహర్నిశలు శ్రమిస్తున్నారు. అయితే 80 శాతం మంది కోలుకోలేక మృత్యువాతపడుతున్నారు. పెద్దాసుపత్రిలో ప్రతిరోజూ మరణాల సంఖ్య 20 నుంచి 25 దాకా ఉంటోంది. గతేడాది 7,9999 మంది కోలుకోలేక మృతి చెందారు. వీరిలో పురుషులు 4,274 మంది, స్త్రీలు 2,242 మంది, చిన్నపిల్లలు 1,483 మంది ఉన్నారు. కర్నూలు చుట్టుపక్కల ఎక్కడ రోడ్డు ప్రమాదాలు, ఇతర ప్రమాదాలు జరిగినా క్షతగాత్రులను వెంటనే కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకే తీసుకొస్తున్నారు. ఇందులో కొందరు ఆసుపత్రికి వచ్చిన కొద్దిసేపటికే మరణిస్తున్నారు. మరికొందరు కాస్త బాగయ్యాక వెంటనే ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్లిపోతున్నారు. సీరియస్‌గా అయితే మాత్రం తిరిగి ఇక్కడికే వస్తున్నారు. మెడికల్ ఎమర్జెన్సీ కేసులైన గుండెపోటు, పక్షవాతం, ఆత్మహత్యాయత్నాలు వంటి కేసులు సైతం చివరి నిమిషంలో క్యాజువాలిటీకి వస్తున్నాయి.

ప్రాణాలు కాపాడేందుకు కృషి చేస్తున్నాం



చివరి నిమిషంలో వచ్చినా, అత్యవసర పరిస్థితుల్లో వచ్చినా రోగి ప్రాణాలు కాపాడేందుకే మా వైద్యులు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. అహర్నిశలు శ్రమించి వారిని కాపాడేందుకు కృషి చేస్తున్నారు. చాలా మంది చివరి నిమిషంలో వచ్చి కూడా క్షేమంగా ఇంటికి వెళ్లిపోతున్నారు. కొందరు మాత్రం కోలుకోలేక మృతి చెందుతున్నారు. ఓపీ, ఐపీ రోగుల ఎక్కువ కాబట్టి ఇక్కడ మరణాల సంఖ్య కూడా ఎక్కువగానే కనిపిస్తుంది. **–డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి, సూపరింటెండెంట్, పెద్దాసుపత్రి, కర్నూలు**

క్లుప్తంగా

మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్


తనిఖీల్లో పట్టుబడిన మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం

కర్నూలు: నగరంలోని ముఖ్యమైన ప్రదేశాల్లో మైనర్ డ్రైవింగ్‌పై ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాలు నడుపుతూ 31 మంది మైనర్లు పట్టుబడ్డారు. వారందరినీ కొత్తపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ దగ్గరకు పిలిపించి ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం కౌన్సెలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కేసు లు నమోదు చేసి, రూ.47,585 జరిమానా విధించారు. తనిఖీలో పట్టుబడిన మైనర్ల తల్లిదండ్రులను పిలిపించి భవిష్యత్తులో వారికి వాహనాలు అప్పగించబోమని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

కానుకల లెక్కింపులో చేతివాటం

- రూ. 78వేల తస్కరణ.. కేసు నమోదు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ హుండీల్లోని కానుకలు లెక్కిస్తూ ఓ వ్యక్తి చేతివాటం ప్రదర్శించాడు. రూ. 78వేల నగదును తస్కరించడంతో సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గత నెల 31న ఉరుకుంద ఈరన్నస్వామి హుండీ డార్మెంటరీ హాల్‌లో కానుకల లెక్కింపు నిర్వహించారు. ఆలయంలో టెంకాయలు కొట్టే చోట పనిచేసే నాగరాజ్ కూడా కానుకల లెక్కింపులో పాల్గొని చాకచక్యంగా రూ. 78 వేలు తస్కరించాడు. ఈ విషయాన్ని జూనియర్ అసిస్టెంట్ వీరేష్ గుర్తించారు. అసిస్టెంట్ కమిషనర్ వాణి ఆదేశాల మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

- రూ.1,18,230 నగదు, 10 బైక్‌లు, 40 మద్యం టెట్రాప్యాకెట్లు స్వాధీనం

తుగ్గలి: మండల పరిధిలోని గిరిగెట్ల శివార్లలో పేకాట ఆడుతున్న ఆరుగురిని తుగ్గలి పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం సాయంత్రం ఎస్‌ఐ మల్లికార్జున తన సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేశారు. వివిధ గ్రామాలకు చెందిన ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1,18,230 నగదు, 40 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు, 10 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మరో ఏడుగురు పరారీలో ఉన్నారని, మొత్తం 13మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విలేకరులకు తెలిపారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య


అజ్మతుల్లాఖాన్ (ఫైల్)

పాణ్యం: నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పాణ్యం ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు కోవెలకుంట్ల మండలం బిజినవేముల గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు మాబూఖాన్, సహినాబాను దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు అజ్మతుల్లా(21) ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్‌సీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం ఉదయం హాస్టల్ నుంచి సహ విద్యార్థులు కళాశాలకు వెళ్లగా అజ్మతుల్లా గదిలోనే ఉండి పోయాడు. ఇంటర్వెల్ సమయంలో సహ విద్యార్థులు గదికి వెళ్లి చూడగా తలుపునకు గడియపెట్టి ఉండటంతో బద్దలు కొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే హాస్టల్ వార్డెన్‌కు సమాచారం ఇవ్వగా స్థానిక శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. వైద్యులు వైద్యం అందిస్తుండగా మృతి చెందాడు. అనారోగ్యంతో చదువులో వెనుకబడి ఒత్తిడికి గురై మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. కుమారుడి మరణాన్ని తట్టుకోలేక తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అజ్మతుల్లా తల్లి స్పృహ తప్పి పడిపోయింది. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య


మృతి చెందిన జయలక్ష్మి

రుద్రవరం: మండల పరిధిలోని డీ.కొట్టాలకు చెందిన వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రామలింగమ్మ, నరసింహారెడ్డి కుమార్తె జయలక్ష్మి(23)ని ఎనిమిది నెలల క్రితం అవుకు మండలం పెద్ద కొట్టాలకు చెందిన నరేంద్రారెడ్డితో పెళ్లి చేశారు. మూడు నెలల నుంచి ఆమెకు జ్వరం, తలనొప్పి ఉండటంతో మందులు వాడినా తగ్గలేదు. దీంతో ఆమె అత్త వారి ఇంటి నుంచి నాలుగు రోజుల క్రితం పుట్టింటికి చేరుకుంది. ఆరోగ్య సమస్యలతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న విష గుళికలు మింగి అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబీకులు గుర్తించి చికిత్స నిమిత్తం నంద్యాల వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పెన్షనర్ల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక


జిల్లా పెన్షనర్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

కర్నూలు(అగ్రికల్చర్): అబ్బాసనగర్‌లోని పెన్షనర్ల సంక్షేమ సంఘం కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రిటైర్డ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రంగారెడ్డి మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సెక్రటరీగా రిటైర్డ్ డీఎస్‌వో జయచంద్రారెడ్డి, కోశాధికారిగా గోవిందరాజు, ఉపాధ్యక్షులుగా పి.శేషయ్య, కెవై సుబ్రమణ్యం, జాయింట్ సెక్రటరీలుగా విజయకుమార్ రెడ్డి, పి.ఆంజనేయులు, సలహాదారులుగా ఆదిరామిరెడ్డి, వెంకట రెడ్డి, పి.ఆంజనేయులు ఎన్నికయ్యారు. అటవీ శాఖ రిటైర్డ్ రేంజ్ ఆఫీసర్ మోహన్‌సింగ్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి మాట్లాడుతూ.. 8 ఏళ్లుగా పెన్షనర్ల సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. తనపై నమ్మకంతో మరోసారి అధ్యక్షుడిగా ఎన్నుకోవడం సంతోషాన్ని ఇస్తోందని తెలిపారు.ప్రస్తుతం అసోసియేషన్‌లో 912 మంది సభ్యులు ఉన్నారని, ఈ సంఖ్యను మరింత పెంచుతామన్నారు.

ఇనుప స్తంభం పడి లారీ డ్రైవర్ దుర్మరణం


మృతిచెందిన నాగబాబు

బొమ్మలసత్రం: పట్టణంలోని స్థానిక నూనెపల్లి సమీపంలో లారీ నుంచి ఇనుప స్తంభాలు అన్‌లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ మీద పడి లారీ డ్రైవర్ దుర్మరణం చెందాడు. అవుట్ పోస్ట్ పోలీసుల సమాచారం మేరకు.. విజయవాడ సమీపంలోని రామవరప్పాడు గ్రామానికి చెందిన నాగబాబు (41) స్థానిక నంద్యాల మెడికల్ కళాశాల భవన నిర్మాణం కోసం ఇనుప స్తంభాలను లారీలో తీసుకొచ్చాడు. సోమవారం లారీలో ఉన్న ఇనుప స్తంభాలను కిందకు దించే క్రమంలో ప్రమాదవశాత్తూ నాగబాబుపై ఇనుప స్తంభం పడింది. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. అప్పటికే తీవ్ర రక్తస్రావం కావటంతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పట్టుదలతో చదివితే విజయం సులువే


మాట్లాడుతున్న డీఈఓ రంగారెడ్డి

కోడుమూరు రూరల్: పట్టుదలతో చదివితే పదో తరగతిలో విజయం సాధించడం సులువేనని జిల్లా విద్యాశాఖాధికారి వి.రంగారెడ్డి అన్నారు. 'పరీక్షా పర్వ్' కార్యక్రమంలో భాగంగా సోమవారం కోడుమూరులోని బాలురు, బాలికల హైస్కూళ్లలో పబ్లిక్ పరీక్షలపై విద్యార్థులకు ఉన్న భయం, అపోహలను తొలగించారు. డీఈఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఈ రెండు నెలల సమయం ఎంతో ముఖ్యమైనదన్నారు. సమయాన్ని వృథా చేయకుండా ఉపాధ్యాయులు సూచించిన విధంగా చదువుకుని వంద శాతం ఫలితాలను సాధించాలన్నారు. అనంతరం నాడు-నేడు పనులను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. హెచ్‌ఎంలు శ్రీనివాస్‌యాదవ్, నాగరాజ కుమారి, ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ అనంతయ్య, ప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ అరుణాచలం రెడ్డి, డైట్ కళాశాల అధ్యాపకుడు షంషుద్దీన్, ఆయా హైస్కూళ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తుల భద్రతకు పటిష్ట బందోబస్తు

- ఎస్పీ రఘువీర్‌రెడ్డి


మహానందీశ్వరుడి దర్శనార్థం వస్తున్న ఎస్పీ, ఈఓ, చైర్మన్, డీఎస్పీలు

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలం, మహానంది, తదితర పుణ్యక్షేత్రాలకు వచ్చే భక్తుల భద్రతకు పకడ్బందీ బందోబస్తు చేపడుతున్నట్లు నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. మహానందిలో జరుగుతున్న శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను సోమవారం ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, డీఎస్పీ సి.మహేశ్వరరెడ్డి, సీఐ రవీంద్ర, ఎస్‌ఐ నాగార్జునరెడ్డిలతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఎద్దుల పందాల పోటీల ఆవరణ, వాహనాల పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం ఎస్పీ రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ పుణ్యక్షేత్రాలు, టూరిజం ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏపీ టూరిస్ట్ పోలీసు సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. మహానందిలో జరిగే శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిరంతర నిఘా ఉంటుందన్నారు. ఎవరైనా భక్తుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ


క్రీడాకారులను సన్మానించిన దృశ్యం

కర్నూలు (టౌన్): ఒడిశా రాష్ట్రం ఇండోర్‌లో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించి సీనియర్ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో కర్నూలు క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఏపీ జట్టు తరపున ఎన్. రవి (ప్రథమస్థానం), బాలికల విభాగంలో కల్యాణి (5వ స్థానం)లో నిలిచారు. వీరిని సోమవారం సాఫ్ట్‌బాల్ కార్యాలయంలో అభినందించారు.

కర్నూలు మార్కెట్ యార్డు ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్ఠం(రూ)	గరిష్ఠం (రూ)
వేరుశనగ	4929	8272
ప్రొద్దుతిరుగుడు	4549	5109
ఆముదం	6189	6601
ఉల్లి	310	951
ఎండు మిర్చి	5151	24280
శనగలు	4340	4580
కందులు	3359	7420
మొక్కజొన్న	1989	2140
మినుములు	6796	7000



ప్రాక్టికల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న జిల్లా వృత్తివిద్యాధికారి జమీర్ పాషా, చిత్రంలో ఆర్‌ఐఓ గురవయ్యశెట్టి తదితరులు, హాజరైన సీఎస్, డీసీఎస్, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు

- ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు
- కాపీయింగ్ జరిగినా, ప్రోత్సహించినా చర్యలు
- ఆర్‌ఐఓ ఆఫీస్‌లో కంట్రోల్ రూం
- ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు

కర్నూలు సిటీ: ప్రాక్టికల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారులు ఆదేశించారు. సోమవారం ప్రభుత్వ జూనియర్(టౌన్ మోడల్)కాలేజీలో ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణపై ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్య శెట్టి, జిల్లా వృత్తివిద్యాధికారి జమీర్ బాషా మాట్లాడుతూ.. ఈ నెల 15న నైతిక విలువలు, 17న పర్యావరణ విద్య పరీక్షలు ఉంటాయన్నారు. ఈ పరీక్షల్లో థియరీకి 60 మార్కులు, ప్రాజెక్టుకు 40 మార్కులు ఉంటాయని తెలిపారు. ఈ రెండింటిలో కలిపి నూటికి 35 మార్కులు రావాలన్నారు. ప్రాజెక్టు చేయకుండా కేవలం థియరీ పరీక్ష రాసి 35 మార్కులు వచ్చినా ఫలితాలు విత్‌హెల్డ్‌లో పెడతారన్నారు. ప్రాజెక్టులో జీరో మార్కులు వచ్చి, థియరీలో 35 మార్కులు వచ్చినా కూడా ఉత్తీర్ణులుగా భావిస్తారన్నారు.

కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షణ

ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. మొదట వొకేషనల్ మూడు దశల్లో, 6 నుంచి జనరల్ విభాగం ప్రాక్టికల్ పరీక్షలు రెండు దశల్లో జరుగనున్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం వొకేషనల్ పరీక్షలకు 51, జనరల్ విభాగానికి 149 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో సీసీ కెమెరాల పుటేజ్ పరీక్షల తరువాత తీసుకునే వారని, ఈ ఏడాది ప్రతి సెంటర్‌లోని ల్యాబ్‌ల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నుంచి లైవ్‌స్ట్రీమ్ ద్వారా పర్యవేక్షించేందుకు ఆర్‌ఐఓ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. ఏవైనా సమస్యలు ఉన్నట్లు అయితే 08518-222047 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదులు చేయవచ్చనని సూచించారు. అనంతరం ప్రాక్టికల్ పరీక్షల కాన్ఫిడెన్షియల్ మెటీరియల్‌ను ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లకు అందజేశారు. ప్రిన్సిపాళ్లు, సీఎస్, డీసీఎస్‌లకు, సబ్జెక్టు లెక్చరర్లకు ఒకేసారి సమావేశం నిర్వహించడంతో చాలా మంది అధ్యాపకులు సమావేశం బయటే వరండాలో కూర్చుండి పోయారు. సీట్లు లేని వారు నిల్చొని ఓరియెంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సమన్వయంతో ఇంటర్ పరీక్షలు

ఇంటర్మీడియట్ థియరీ, ప్రాక్టికల్ పరీక్షలను అన్ని శాఖలకు చెందిన అధికారుల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాయని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్యశెట్టి అన్నారు. సోమవారం కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని డీఆర్‌ఓ చాంబర్‌లో ఇంటర్మీడియట్ పరీక్షలపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయనతో పాటు జిల్లా వృత్తివిద్యాధికారి జమీర్ పాషా, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురవయ్యశెట్టి మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నుంచి ప్రాక్టికల్ పరీక్షలు మొదలై,వచ్చే నెల 7వ తేదీ వరకు జరగనున్నాయన్నారు. థియరీ పరీక్షలు మార్చి 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరగనున్నాయన్నారు. పరీక్ష జరిగే సమయంలో కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రతి కేంద్రానికి విద్యార్థులు సకాలంలో చేరుకునేందుకు అవసరమైనన్ని బస్సులు అన్ని రూట్లలో ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కేంద్రం దగ్గర పోలీసులు 144 సెక్షన్ అమలు చేయాలన్నారు.